# పాలకంకులు

## - వచన కవిత్వం

: రచన :

**మాదస్త ప్రణవి**

# PALAKANKULU

- Vachana Kavithvam

by

**Madasta Pranavi**

Cell : 93478 10982

email: pranavimadasta@gmail.com

First Edition : July - 2023

Copies : 300

Publishers :

**MADASTA PUBLICATIONS,**

Price : **Rs.**

for copies :

**MADASTA PRANAVI**

Vill. Gouraram,

Post. Nallavelli,

Mdl. Indalwai,

Nizamabad. (T.S.) Cell: 93478 10982

Designing & Printing:

Ankam Bhoomesh

**SHREE DIGITAL**

Jawahar Road, Nizamabad. (T.S.)

Cell: 98496 71061.

# అభినందన..

సుమారుగ ఐదారేళ్ళ కిందట ప్రణవి ఒక కవిసమ్మేళనంలో వచ్చి తనను పరిచయం చేసుకొన్నది. కవిత చదివింది. అందులోని మెరుపు నాకు చాలా నచ్చింది. తప్పకుండా ఈ అమ్మాయి మంచి కవయిత్రిగా రాణిస్తుందని ఆనాడే అనిపించింది. తర్వాత రోజులలో తరచూ ఫోనులలో, అపుడపుడూ కలిసినపుడు కానీ కవితానిర్మాణం మీద మాత్రమే మా చర్చలు జరిగేవి. కవిత్వం మీద తన అపేక్షకు ఆనందం వేసేది.

కవిత్వీకరణ సూచనలను నిర్మలంగా స్వీకరించడం, అంతే వేగంగా తన కవితలలో వాటిని అనువర్తితం చేయడం, నాకు చాలా సంతోషం కలిగించేది! నన్ను కవితాగురువు గా భావించడం ప్రణవి సంస్కారం. నేనైతే శ్రద్ధగా విని, ఆకళింపు చేసుకొనే ప్రవర్ధమాన ప్రణవి ని దగ్గరనుండి చూసాను. తన రచనావికాసానికి పొంగిపోయాను.

ప్రణవిది కవితాపుస్తకం రావాలనీ, ఆశించాను. ఈ క్రమంలోనే, ప్రతిష్టాత్మకమైన శ్రీమతి సుశీలానారాయణరెడ్డి ట్రస్టువారి కవయిత్రుల తొలికవితా సంపుటులకు పూర్తి ఆర్థిక సహకారం అందించే ప్రకటన రాగానే, నాకు ముందుగ నాకు ప్రణవే గుర్తుకొచ్చింది. వెంటనే తెలిపాను తనకు.

అంతే వేగంగా స్పందించి కవితలందించడం, తెలుగు ఉపన్యాసకులు, కంప్యూటరు నిపుణులు, సోదరుడు ఇరుముల వినయ్ కు పంపించడం, రెండే రోజుల్లో అతను కవితలను డిటిపి చేసి పుస్తకం సిద్ధం చేయడం, ఆపై ట్రస్టువారికి పంపించడం చకచకా జరిగాయి.

పోటీ ఎక్కువుందనీ, వచ్చిన కవితలపుస్తకాల ఎంపిక ఒక సీనియర్ కవులబృందం చేస్తున్నదని తెలిసింది. నాకు నమ్మకం మా ప్రణవమ్మ పుస్తకం

ఎంపికౌతుందని. నా నమ్మకం నిజమైంది. మంచికవిత్వానికి ఆదరణ ఆలంబన దొరుకుతుందనీ ఋజువైంది.

ఇక ఈ “పాలకంకులు” పుస్తకంలోని కవితల గురించి చెబితే, కవితలలో సానుకూలత, ఆర్ద్రత, కవితావస్తువుల మీద ఆప్యాయత, అనుభూతి, సానుభూతి, చిక్కనికవితాభివ్యక్తి, కన్పిస్తాయి.

తన తొలి కవితాపుస్తకపు అడుగునే బలంగా వేస్తున్న మాదస్త్రప్రణవికి హృదయపూర్వక శుభాకాంక్షలు.. తన నుండి మరిన్ని రచనలు ఆశిస్తూ.. ఆశీర్వదిస్తూ..

గురువాత్సల్యంతో..

**డా. కాసర్ల నరేశ్ రావు**

రాష్ట్రకార్యదర్శి – తెలంగాణ రచయితల సంఘం,

9441406252

# ఆప్తవాక్యం

ప్రణవి అందరిలాంటి అమ్మాయి అనిపిస్తుంది చూసినప్పుడు. ఆమె రాసిన కవితను విన్నప్పుడూ, చదివినప్పుడూ అందరిలో ముందు నిలబడే అమ్మాయి కదా అనిపిస్తుంది. తెలంగాణ ఆడపిల్లలోని తెగువ, ఒద్దిగతనం, నేర్పు, సమయస్ఫూర్తి వీటికి తోడు అక్షరాలను ప్రేమించే గుణం ప్రణవి ప్రత్యేకం. "నిజామాబాద్ జిల్లాలో కవయిత్రులు ఉన్నా ఎందుకో ఇంకా సంఖ్య ఎక్కువ ఉండాల్సింది" అని అనుకునేవాళ్ళం. ఆ సమయంలోనే ఈనాడు దినపత్రికలో ఒక కవిత చదివాను. క్రింద చిరునామా చూసేసరికి ప్రణవి, గౌరారం గ్రామం, ధర్పల్లి మండలం, నిజామాబాద్ అని కనబడింది. మరోసారి ఆ కవిత చదివాను.

"ఒక్క క్షణం ఆలోచించు మిత్రమా" అనే శీర్షికతో ఎన్నికల నేపథ్యంలో రాసిన కవిత అది. ఎంతో పరిణితి చెందిన కలం రాసిన కవితలా కనబడింది. ఫేస్బుక్ తిరగేస్తూ ప్రణవి గురించి సెర్చ్ చేసి నప్పుడు తన వాల్‌పై మంచి కవితలు ఎన్నో కనబడ్డాయి. నిజామాబాద్ జిల్లా గర్వించదగ్గ కవయిత్రిగా ఈ అమ్మాయి ఎదుగుతుంది అనిపించింది. ఫోన్ చేసి మాట్లాడాను. అభినందించాను. "హరిదా రచయితల సంఘం, తెలంగాణ రచయితల సంఘం కార్యక్రమాల సమాచారం తెలియజేస్తాను తప్పకుండా రావాలి"అని చెప్పాను. 'సరే సార్' అన్నది వినమ్రంగా.

తర్వాత తెలిసింది. ప్రణవి మా సోదరి తెలుగు పండితురాలు రేణుక స్టూడెంట్ అని. రేణుక కలం శక్తి ఎక్కువగా ప్రదర్శించకపోయినా, విద్యార్థులను సాహిత్య పరంగా ప్రోత్సహించడం ఎంతో ఇష్టంగా చేస్తుంది. నాకు కూడా ఆమె ప్రోత్సాహం ఎంతో బలం. ఇక ప్రణవికి తిరుగు లేదని రూఢీ చేసుకున్నాను.

ప్రణవి ఆశించినట్టుగానే కవితలే కాదు కథలు చక్కగా రాస్తున్నది. ఈ మధ్య తను తిరిగి వచ్చిన పర్యాటక ఆధ్యాత్మిక స్థలాల పర్యటన విశేషాలతో

యాత్రా చరిత్ర రాస్తున్నానని చెప్పింది. చాలా సంతోషం వేసింది. ఇలా బహుముఖీనంగా ప్రణవి పురోగమించడం ఎంతో హర్షదాయకం.

2018 నవంబర్ 20న హరిదా రచయితల సంఘం నిర్వహించిన "కొఱవిగోపరాజు సాహిత్య వైభవ సమాలోచన రాష్ట్రస్థాయి సదస్సు"లో మొదటిసారిగా పాల్గొన్నది. అప్పటినుంచి హరిదా రచయితల సంఘంలో కీలక సభ్యురాలిగా, డాక్టర్ వి. త్రివేణి, డాక్టర్ వెంకన్న గారి జ్యోతి గార్లతో కలిసి మహిళా విభాగంలో చురుకుగా సేవలందిస్తున్నది. హరిదా మానస యువ కవయిత్రి పురస్కారాన్ని, రోటరీ క్లబ్ ఎక్సలెన్సీ పురస్కారాన్ని ఇప్పటికే ప్రణవి కవిత్వం సాధించింది. తెలంగాణ జాగృతి ప్రతిష్టాత్మకంగా ప్రచురించిన "పూల సింగిడి" కవితా సంపుటిలో ప్రణవి కవిత అచ్చయ్యింది. తంగేడు సాహిత్య పక్షపత్రిక, నమస్తే తెలంగాణ ఇలా పలు పత్రికలలో ఆమె కవితలు అచ్చవుతున్నాయి.

ప్రణవి కవిత్వం విషయానికి వస్తే చక్కని పరిశీలనాసక్తి, సమకాలీనులను అధ్యయనం చేసే అనురక్తి, చాలా బలంగా ఎక్స్ప్రెషన్ వ్యక్తీకరించే అక్షర శక్తి ప్రణవిని గట్టిగా నిలబెడుతున్నాయి.

నాన్న గురించి చెబుతూ

"మా బ్రతుకు పుటల నడుమ చీకటులను మటుమాయం చేయుటకై
రగిలి రగిలిపోయిన ప్రభారవి గురించి నేనేం చెప్పగలను
చెప్పటమే చేతకాని నేను
తనకోసం ఏం చేయగలను
ఏళ్ల తరబడి సంసారపు బండిని
లాగి లాగి అలసిపోయిన నాన్నకి అమ్మనవటం తప్ప"

నాన్నను ఎంత బాగా చదివింది. నాన్న కష్టాన్ని గుర్తిస్తూ, నాన్నకు అమ్మలా ఉండాలన్న పరిణితి తన బిడ్డలకూ ఉండాలనుకుంటాడు ప్రతి తండ్రి ఈ కవిత చదివాక.

"ఆమె" అనే కవితలో

"ఈ మట్టిలో పుట్టి పెరిగిన  పైరు బిడ్డకితానే తల్లినంటుంది

ఆకాశమంత ఎదిగి కూడా ఇంకా అత్తచాటు కోడలునంటుంది

ఇగురం అంటే ఇదే కదా"

మహిళల శక్తిని, మమకారాన్ని సమాంతరంగా ఇలా ఎంతో చక్కగా వర్ణించింది ప్రణవి.

బతుకులో మోసపోయిన ఆడపిల్లల ఆవేదనను "ఎలా?" అనే కవితలో ప్రణవి చెప్పిన తీరు ఎంతటి వారినైనా కదిలిస్తుంది.

"ఎలా రావాలో చెప్పు

ప్రేమ కలశాన్ని కాలితోతన్నేసావ్

ఎగిరే పావురానికి ఎరవేసి పట్టి

గుండెలో ఆశలన్నీ గుడ్డిగా పొడిచేశావు

కొత్తగా గూటికి వచ్చిన గువ్వపిల్లకి

మెత్తగా కొలిమిలో కొ(్రాయినంచించావు"

వంచన తెలిసినంక మళ్లీ పంచన చేరడం కుదరదు అని చెప్పే తెగువనే ఈనాటి మహిళకు రక్షణ.

"సమాజానికి పల్లెటూర్లను చిన్నచూపు చూసే లక్షణం

ఏం అంటగట్టాడో గాని

పాపెడ కనిపిస్తే చాలు

పల్లెటూరు పల్లెటూరుఅంటూ

వెక్కిరింతలకు రెక్కలు తొడుగుతున్నారు"

అంటూపాపెడ అనే కవితలో ఆధునిక కాలపు పోకడలను  సూటిగా ప్రశ్నిస్తుంది.

ప్రణవి బడిని, తెలుగును ఎంతో ఆరాధించింది. అందుకే అక్షరాలా మీతో స్నేహం చేస్తున్నాయి. బడి అనే కవితలో

"ప్రగతి పథంలో పల్లవించిన
మా పాఠశాల వైపు అడుగులు వేశాను
చుట్టూ చూస్తుంటే
వలస వెళ్లిన పిల్లల రాక కోసం
ఎదురుచూసే అవ్వకళ్ళలా కనిపించాయి"

అంటూ చదువు పూర్తి కాగానే విడిచిన బడిని ఒక బిడ్డగా తిరిగి దర్శించినప్పుడు బడి తల్లిలాగే కనబడుతుంది కదా!

అలాగే "తెలుగు" అనే కవితలో
"అమ్మో ఏమిటి పరిమళం
దీనికి దొంగనే దోచుకునేంత సౌందర్యమా
ఈ గమ్మత్తైన మత్తులో నేను పడుతున్న భ్రమో"

తెలుగు భాష పై ఇష్టాన్ని ఎంతో కొత్తగా, అద్భుతంగా వర్ణించిన ప్రణవిని తెలుగు ఆత్మ అల్లుకుపోవడంలో ఆశ్చర్యం ఏముంటుంది?

"తెలుగు టీచర్" అనే కవితలో మా సోదరి రేణుక అణువణువునా కనబడుతుంది.

"ఆమె చేతిలో చిక్కితే చాలు
నల్లబల్లమడిలో సుద్ద ముక్క నాగలవుతుంది
ఆ చేతితో అక్షర విత్తనాలు చల్లిందంటే చాలు
మా చదువుల పంటకు
సాహిత్య ధాన్యానికి కొదువెక్కడిది"

ఇంతగా ప్రభావితం చేసే తెలుగు టీచర్లు తెలంగాణలో ఉన్నారు కాబట్టే తెలంగాణ తెలుగు మాగాణంగావర్ధిల్లుతున్నది.

"మా ఊరు" కవిత చదివినప్పుడు కలిగే అనుభూతి అంతా ఇంతా కాదు. పల్లెటూరును ఒక అందమైన కథ లాగా, పర్యాటకకేంద్రమంత గొప్పగా ఆవిష్కరించింది ప్రణవి.

ఆ కవితలోని ఈ పంక్తులు చూడండి

"పక్షుల రాగాలతో సాగిపోయే

సెలయేటి గానాలకు

చాకలిబండ తాళం వేసేది"

"అశరీర" అనే కవిత ఒక చిత్రకారుడు గీసిన బొమ్మలా పాఠకులను వెంటాడుతూనే ఉంటుంది.

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తెలంగాణ గురించి రాస్తూ

"నేడు చీకటి రెక్కలు విరుచుకుంటూ

పైపైకి లేచిన తొలిపొద్దై వికసించింది

నా తెలంగాణ" అంటూ తెలంగాణ పురోగతిని విశ్లేషించింది. ఇలా ఈ "పాలకంకులు" కవితా సంపుటిలో ప్రతి కవిత పాఠకుని మనసు దోచుకోవడమే కాదు... మంచి ఆలోచనల వైపు నడిపించే వెలుతురులా శోభిస్తుంది.

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి సతీమణి పేరిట ఏర్పాటుచేసిన "శ్రీమతి సుశీల నారాయణరెడ్డి ట్రస్ట్" వారు ప్రతిభావంతులైన కవయిత్రుల పుస్తకాలను ముద్రణ చేస్తున్నారు. ప్రణవి తన "పాలకంకులు" కవితా సంకలనాన్ని ట్రస్ట్ కు పరిశీలన కోసం పంపడం, వారు ముద్రణకు ఓకే అనడం ప్రణవి కవిత్వంలోని గాఢతను చాటి చెబుతున్నది. ఇటువంటి ప్రతిభగల ఆడపిల్లలకు అండగా నిలుస్తున్న శ్రీమతి సుశీల నారాయణరెడ్డి ట్రస్ట్ వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

ప్రణవి పుట్టిన ఊరు గౌరారం చక్కని జలపాతం సోయగాలతో అలరించే సిర్నాపల్లికి దగ్గర. సిర్నాపల్లి దొరసాని శీలం జానకి బాయి ధైర్య సాహసాలు, పరిపాలనా పటిమ అక్కడి నీళ్లలో అడుగడుగునా ప్రేరణ కలిగిస్తాయి. సిర్నాపల్లి కోటలో ఇప్పుడు నిర్వహించబడుతున్న గ్రంథాలయం ఏర్పాటులో ప్రణవిది కీలక పాత్ర. పుస్తకాల సేకరణకు చాలా శ్రమించింది. ప్రణవి వ్యక్తిగత జీవితం అందర్లాగే సుఖదుఃఖాలతో కూడుకున్నది. జీవితాన్ని సార్థకం చేసుకునేందుకు

సాహిత్యాన్ని మార్గంగా ఎంచుకున్నది. "సాహిత్యమే జీవితం–జీవితమే సాహిత్యం" అని దృఢంగా సాగుతున్నది. జీవితం ఎలా ఉన్నా కవిత్వం వ్యక్తిత్వంగా వ్యక్తిత్వం కవిత్వంగా ముందుకు సాగుతున్న వాళ్ళు సంతృప్తిగా జీవితాన్ని విశ్లేషించుకుంటూ ముందుకు సాగుతారు. ప్రణవి ఆ కోవలోనే బతుకు సాగిస్తున్నది.

కవయిత్రిగా, రచయిత్రిగా ఆర్గనైజర్గా ప్రతిభావంతురాలైన ప్రణవి తెలంగాణ సాహిత్య మాగాణంలో పచ్చని సంతకమై... నిజామాబాద్ జిల్లా గర్వించదగ్గ బలమైన కవయిత్రిగా దినదిన ప్రవర్ధమానం చెందాలని ఆశిస్తూ... తొలి కవితా సంపుటితో పుస్తకం ప్రచురించిన కవయిత్రిగా కొత్త క్లబ్ లోకి ప్రవేశిస్తున్న ప్రణవికి శుభాకాంక్షలు. అభినందనలు.

తేదీ :06 /07/2023

ఆత్మీయంగా...

**ఘనపురం దేవేందర్**

రాష్ట్ర ఉపాధ్యక్షులు

తెలంగాణ రచయితల సంఘం

# కష్టాల పంకంలో విరిసిన కవితా పద్మం

కవిత్వం ఓ వరం. భావవేశాలను అదుపులో ఉంచి, మానసిక ఆరోగ్యాన్ని అందిస్తుంది కవిత్వం. రసాస్వాదన కలిగి స్ట్రెస్‌ను దూరం చేసే మహా ఔషధం. తనలో తాను రమిస్తూ అలౌకిక ఆనందాన్ని ఇస్తుంది. అటువంటి వరాన్ని పొందింది కవయిత్రి మాదస్త ప్రణవి.

మొదటి పుస్తకం ముద్రితమవుతుందంటే ఆ ఆనందమే వేరు. మొదటి బిడ్డను ఒడిలో లాలించినట్లు అనిర్వచనీయమైన ఆనందం పొందుతారు. అటువంటి అవకాశాన్ని ప్రణవి డాక్టర్ సి.నారాయణరెడ్డి గారి ఆశీస్సుల రూపంలో ఆర్థిక సహాయం అందడం అదృష్టం. వారి ఆశీస్సులు ప్రణవికి ఎప్పుడు అందాలి. ప్రణవి నాకు భగవంతుడిచ్చిన బిడ్డ. చాన్నాళ్ల పరిచయం మాది. నా గొంతు వినందే మా ప్రణవికి తృప్తి ఉండదు. తన ప్రతి కవితకి మొదటి శ్రోతను నేనే. కవితలను మలుచుకునే సందర్భంలో, అర్థ వివరణల కోసం మా మధ్య సంభాషణలు జరిగేవి. పల్లె పద పరిమళం ప్రతి కవితలో గుభాళించేది.

చిన్నప్పటినుండి కష్టాలను చవిచూసింది ప్రణవి. ఆ కష్టాల కడలి నుండే ఈ కవిత్వపు కలశం ఆవిర్భవించింది. ఈ భావుకతే ఆమెకు తోడు. ప్రణవి నానమ్మ ప్రేమమయి. ప్రణవికి లోకా నుభవం, పద భాండాగారం అందించింది.

పాలకంకులు కవితా సంపుటిలోని ప్రతి కవిత పాఠకుడిని ఆసాంతం చదివేలా చేస్తుంది. భావుకతకు లోను చేస్తుంది. భేష్ అనిపించుకుంటుంది. ఎన్నుకున్న వస్తువును ప్రతీకాత్మకంగా చిత్రిస్తుంది. ఆ వస్తువును చూసే దృష్టి కోణాన్ని మార్చేస్తుంది. కవయిత్రి ప్రణవి ప్రకృతి ఆస్వాదకురాలు. పల్లెటూరి జీవనం తనది. అనుబంధాల విలువలు తనకు తెలుసు. కనుకనే ప్రతి కవితలో సజీవత్వం ఉట్టిపడుతుంది.

"ఆమె" కవితలో ఇక తన ఇంటి మడిలో

అప్పుడప్పుడు మొలకెత్తి

కలతల కలుపులు తీస్తూ

తన కాపురాన్ని పండిస్తుంది కడగండ్ల బరువులెత్తాలంటే

ఓర్పు సుట్ట తప్పనిసరి అంటుందిలి

పల్లెటూరి గృహిణి ఇంటి సంసారాన్ని చక్కదిద్దుకుంటూ వ్యవసాయ పనుల్లో పెద్ద భాగస్వామ్యాన్ని పంచుకుంటుంది. ఆ విషయాన్ని ప్రణవి ఒడిసి పట్టుకొని ఇంటిమడి/ కలతల కలుపులు/ కడగండ్ల బరువు/ ఓర్పు సుట్ట లాంటి ప్రతీకల రూపకాలను తన కవితలో పొదిగింది. ఇలాంటి అందమైన పదాల పొందిక ప్రతి కవితలో కనిపిస్తుంది.

పాలకంకుల లాంటి కవితల రుచిని పాఠకులు తప్పకుండా ఆస్వాదిస్తారు. ఆహ్వానిస్తారు. ప్రణవి కలం నుండి మరిన్ని సాహిత్యపు ఝరులు ప్రవహించాలని మనసారా ఆశీర్వదిస్తూ.....

**డా.శారదాహన్మాండ్లు.**<br>
అధ్యక్షులు,<br>
చీలం జానకీబాయ్ రచయిత్రుల సంఘం,<br>
నిజామాబాద్.

# కృతజ్ఞతలు

నా ఈ "పాలకంకులు" – కవితాపుస్తకంను ఎంపిక చేసి ఆర్థిక సహకారాన్ని అందించి, ప్రచురించిన శ్రీమతి సుశీల నారాయణ రెడ్డి ట్రస్ట్ వారికి ముందుగా నా ప్రత్యేక ధన్యవాదాలు.

నిత్యం నా శ్రేయస్సుకై పరితపించే నా తల్లిదండ్రులు శ్రీమతి మాదస్త లక్ష్మీ, కీ.శే. మాదస్త కిషన్ గారికీ, మరియు ప్రస్తుతం మా మధ్య లేకపోయినా మమ్మల్ని తన చల్లని చేతులతో దీవించి, తన ప్రేమతో మా మనసులు కట్టిపడేసి, మాకు మరో అమ్మగా నిలిచిన మా అవ్వ (నాయనమ్మ)కు, మరియు మిత్రుడిగా నాతో ఉంటూ నాన్నలా నన్ను చూసుంకుంటూ నిత్యం నాకు ప్రోత్సహం అందించే మా అన్నయ్య ప్రసాద్‌కు అన్నతో పాటు నాకు ప్రతి విషయంలో ప్రోత్సహం అందించే మా వదిన లక్ష్మశ్రీ గారికి ముందుగా కృతజ్ఞతలు.

నా స్వరం అంతగా బాగా లేకపోయినా నాకు పాటలు పాడటం చాలా ఇష్టం. కానీ ఏదైనా కొత్తగా ఉండాలి అని చిన్నప్పుడు బడిలో పేరడీ గీతాలు రాసుకుని పడేదాన్ని. అది అందరికీ ఆనందాన్నే కాదు ఇలా ఎలా రాశావు అనే ఆశ్చర్యాన్ని కలిగించేది. అది నాకు ఇంకా ఆనందాన్ని కలిగించేది.

నేను ఇంటర్ చెదివే రోజుల్లో అందె జీవన్ రావ్ గారు మా ప్రిన్సిపల్‌గా ఉండేవారు. వారి సహాయంతో నాకు డా. కాసర్ల నరేశ్ రావు సార్ గారితో పరిచయం ఏర్పడింది. ఆయన పిలుపుతో తెలంగాణా సారస్వత పరిష్యత్తు 75వ వార్షికోత్సవాలు నిజామాబాద్ అంబేద్కర్ భవనంలో తొలిసారిగా కవితను చదివాను. నరేశ్‌సార్ నన్ను అభినందించి ఆయన రాసిన పుస్తకాలు ఇచ్చి ఇంకా బాగా రాయాలని ఆశీర్వదించారు. సార్ పుస్తకాలు బాగా చదివాను. అప్పుడే నిర్ణయించుకున్నాను ఆయనే నా సాహిత్య గురువని. ఈ రోజు నేను కవిత్వం బాగా రాయగలుగుతున్నాను అంటే అది ఆయన పుస్తకాలు

చదివినందువల్లే. ఆయన ప్రసంగాలు నా మీద కాస్త ఎక్కువ ప్రభావం చూపించాయి. ఈ పుస్తకం ముందుకు తీసుకురావటానికి ఆయన పడ్డ శ్రమ నేను మర్చిపోలేనిది. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే ఆయన లక్షణం ఆయన పట్ల నాకు మరింత గౌరవాన్ని పెంచింది. తరువాత ముఖ పుస్తకంలో నేను రాసిన కవితలు చదివి నాకు ఎన్నో వేదికలపై కవితాగానం చేసే అవకాశం కలిగించి, ఎన్నో సాహిత్య  సదస్సులలో మంచి విషయాలు తెలుసుకునే అవకాశం కలిగించి పదమ్మా అంటూ నన్ను ముందుకు నడిపిన ఘనపురం దేవేందర్ సార్ గారి ప్రోత్సాహం నేను మరువలేనిది. సాహిత్య జగత్తులో ముందుకు దూసుకు వెళుతూ మా యువతకు ఆదర్శంగా నిలిచిన డా. ముల్లెగోడ గంగా ప్రసాద్ గారికీ,  జన్మనివ్వక పోయినా నన్ను బిడ్డలా ఆదరించే డా. శారదాహన్మాండ్లు గారికి, బాల్యంలోనే భాషా పరిమళాన్ని లేత గుండెకు అద్దీన మా ఉపాధ్యాయురాలు శ్రీమతి కామినేని రేణుక గారికీ హృదయ పూర్వక ధన్యవాదాలు.

ఎస్.పి.ఆర్ కళాశాలలో అనునిత్యం ప్రోత్సహం అందించిన మా అధ్యాపకురాలు పద్మారాణి గారికీ, కవిసమ్మేళనాల్లో పరిచయమై నన్ను, నా కవిత్వాన్ని ఎంతో ఆదరించే డా. త్రివేణీ మేడం గారికి, వెంకన్నగారి జ్యోతి గారికీ, అమృతలత మేడంగారికి, కిరణ్ బాల గారికీ, వి. ప్రభాదేవి గారికీ, సమతా గారికీ, హరిప్రియ గారికీ, చందన్ రావ్ గారికీ, బెజుగామ రామమూర్తి గారికీ, నరాల సుధాకర్ గారికీ, పింగలి గంగాధర్ గారికీ, మద్దుకూరి సాయిబాబు గారికీ, దారం గంగాధర్ గారికీ, సురేష్ గారికీ, గంట్యాల ప్రసాద్ గారికీ, డి.టీ.పి సహకారం అందించిన వినయ్ గారికీ, (విద్యా హై స్కూల్ ) అనితా మేడం గారికి, ఉపాధ్యాయ బృందానికి నా కవితలు పత్రికలలో ప్రచురించిన విలేఖరి రాజేందర్ (ఇందలవాయి) గారికీ, కత్తి గంగాధర్ గారికీ, ఈనాడు, నవ తెలంగాణా, తంగేడు(మ్యాగజిన్), సాక్షి,నేటి నిజం పత్రికలకు.

అలాగే నా బాల్య మిత్రులు రోజా, స్రవంతి, రత్నా, అపర్ణ, జయలలిత, రేణుకలకు మరియు నా ఆధ్యాత్మిక పయనంలో నన్ను ముందుకు నడిపే

డా. సంధ్యారాణి గజేంద్రనాథ్ (సంగారెడ్డి) గారికీ, లావణ్య శ్రీ గారికీ, రామానందరాయ గౌరదాస్ సుగోపి మాలతిదేవిదాసి గారికీ హృదయ పూర్వక ధన్యవాదాలు. స్వప్నిల్ భారత్ గ్యాస్ డీలర్ బుర్ర గంగాధర్ గారికీ, హజార్ గారికీ, సిర్నాపల్లి జాహిద్ భాయ్ గారికీ, పింగలి అనూరాధ రెడ్డి గారికీ, నా ఈ పుస్తకానికి తుది మెరుగులు దిద్దిన శ్రీ డిజిటల్, అంకం భూమేశ్ గారికి...

నా ప్రాణప్రథమైన నా మేనకోడలు నవదకు, మేనల్లుడు కన్నయ్యకు మరియు మా బంధు మిత్రులందరికి, నా శ్రేయోభిలాషులకు అందరికీ పేరు పేరునా...

## ధన్యవాదాలు

**- మాదస్తు ప్రణవి**

# నాన్న

రేపు ఫాదర్స్ డే కదా
తరగతి గదిలో నాన్న గురించి చెప్పాలన్నారు
టీచరు గారు

ఏం చెప్పాలో...!
ఏం చెప్పాలో నాన్న గురించి
తన శ్రమధారచే మా జీవితాలను మొలకెత్తించిన
ఆ నిరంతర శ్రామికుడి గురించి ఏం చెప్పగలను

మా బ్రతుకు పుటల నడుమ
చీకటులను మటుమాయం చేయుటకై
రగిలి రగిలి పోయిన ఆ ప్రభారవి గురించి నేనెం చెప్పగలను

ఆటపాటల్లో నాకు అండగా నిలిచిన
ఆ గుండె ధైర్యం గురించి
నా ప్రతి విషయంలో పాలు పంచుకున్న
నా తొలి మిత్రుని గురించి నేనెం చెప్పగలను

నింగి కన్నీళ్ళు పెట్టుకుంటే నేల కడుపు పండినట్లు
తన కష్టాన్ని మా కంచంలో పరమాన్నంగా పండించిన
మా ఇంటి వెన్నెముక గురించి నేనేం చెప్పగలను

అప్పుడప్పుడు తన ఆలస్యంతో విస్తరించిన అమ్మకోపాన్ని
చిన్ని చిరునవ్వుతో అటకెక్కించిన

ఆ అనురాగ దీప్తి గురించి నేనేం చెప్పగలను
ఆరడుగుల మనిషైనా
అవ్వమాటలకు ఏనాడూ ఎదురుచెప్పని
ఆ వినయ సంపన్నుడి గురించి నేనేం చెప్పగలను

మరి చెప్పటమే చేతకాని నేను
తనకోసం ఏం చేయగలను!
యేళ్ల తరబడి సంసారపు బండిని
లాగి లాగి అలసిపోయిన నాన్నకి అమ్మనవటం తప్ప

# ఆమె

తన జీవన భూమి సాగుకై
నడకను ప్రారంభించిన నాగలికర్రు ఆమె

దు:ఖాలను దిగమింగడం
పెదవులపై నవ్వులు పూయించడం
ఆమెకు వెన్నతో పెట్టిన విద్య

ఆమె పలుకుల తడి తగిలాక
అనుబంధాల మొలకలు ఆయువు పోసుకోవలసిందే
ఆమె ఓలలాడించే తన ప్రేమపొత్తిల్లలో
ఎవరైనా ఒదిగిపోవల్సిందే

అలా కమనీయంగా తాను కలలనాట్లు వేస్తుంటే
కట్టలు తెంచుకున్న స్వరగంగ
తన నోట ప్రవహిస్తుంది

ఇక తన ఇంటిమడిలో
అప్పుడప్పుడు మొలకెత్తే కలతల కలుపులు తీస్తూ
తన కాపురాన్ని పండించుకుంటుంది
కడగల్ల బరువులెత్తాలంటే
ఓర్పుచుట్టా తప్పనిసరి అంటుంది

కన్నెర్రజేసే కరువుకి
ఘాటుగా సమాధానం చెప్పే నాటుకొడవలై
ఆర్తనాదాలకు స్వస్తి పలుకుతుంది

ఈ మట్టిలో పుట్టిన పైరుబిడ్డకి తానే తల్లినంటుంది
ఆకాశమంత ఎదిగి కూడా
ఇంకా అత్తచాటు కోడలునంటుంది
ఇగురం అంటే ఇదే కదా!

# బతుకమ్మ

హాయి పరిమళాలను ఆనందంగా ఆస్వాదిస్తూ
అడవితల్లి ఒడిలో అపురూపంగా పురుడోసుకుంది

పరుచుకున్న బీరాకు ఒడిలో
ఒదిగిన గునుగు గుమ్మడి పూలల్లో
పసిడి వర్ణాలద్దుకున్న తంగేళ్లల్లో
తల్లి బతుకమ్మ తలదాచుకుంది

కదం తొక్కే కాళ్లతో
సవ్వడిచేసే మువ్వల కరచాలనంతో
గాజులు వేసే గమ్మత్తైన తాళాలు
సంబరానికి సరైన తోడులా కనిపిస్తుంటే

పరుగులెత్తిన పడుచుతనం
పరవసించిన అమ్మతనం
కలిసి ఆడుకునే తరుణంలో కదిలింది బతుకమ్మ కమనీయమై
వెలిగింది బతుకమ్మ రమణీయమై

# దీనురాలు

ఆరుబయటికి తోసేసిన అవ్వతనువుని
అమావాస్య చీకటి చూసింది
మాసిన చీరతో
మాయని తనమదిలో గాయాలతో
తాను కదిలిపోతుంటే
ఆమె వెంట గాలి పరుగులు తీస్తుంది.
అది చూసిన నింగి గుండెకు చిల్లులు పడ్డాయి

ఆ గమ్యమెరుగని పయనానికి
తడికన్నులే నిలయంగా మారాయి

ఆమెను చేరదీసేందుకు చేతులు చాచిన
చెట్టుకొమ్మలు చెంతకు రమ్మని ఊగుతున్నాయి
ఆ నీడలో తరువుకొరిగి కూర్చుని ఎక్కెక్కి పడి ఏడ్చే అవ్వను
దిక్కులన్ని దీనంగా చూస్తున్నాయి
నిశ్శబ్దం నిద్దర ఊసే మరిచింది

అంతలోనే కాలసర్పం కోరలు చాచింది.
కనులు తెరచి వుండగానే తనను కనుకరించి
శాశ్వత నిద్రను సొంతం చేసింది....!
ఇక అవ్వకు శాశ్వత విశ్రాంతి

# ఎలా

ఎలా?
ఎలా రావాలో చెప్పు
ప్రేమ కలషాన్ని కాలితో తన్నేశావు
ఎగిరే పావురానికి ఎరవేసి పట్టి
గుండెలో ఆశలని గుడ్డిగా పొడిచేశావు

కొత్తగా గూటికి వచ్చిన గువ్వపిల్లకి
మెత్తగా కొలిమిలో కొౖరాయినంచించావు

పండే పంటను దున్నేసి పరికి ముళ్లను నాటావు
నవ్వులంటిని నడిసంద్రంలో పాతేశావు
అందమైన జ్ఞాపకాలు
నిలుపుకోవలసిన సమయంలో
నిప్పుల వర్షం కురిపిస్తూ నిలువెల్లా తడిపేస్తావు
దారి గుండా తుమ్మముల్లు పరచి తూనీగను తీసుకురమ్మన్నావు

కంచంలో కూడు కన్నీళ్ళతో నిండుతున్నా
కనికరించకుండా
కసాయితనాన్ని కొసరుగా వేసావు

పక్కనే ఉండి కూడా
ఒంటరి పోరాటం చేయించి
ఓడిపోయానంటూ నీ బ్రతుకు నుండి నన్ను
బహిష్కరించావు

# సెలవులు రావాలి

ప్రాణమున్న యంత్రాలకు
ఉరుకుల పరుగుల జీవితాలకు
విరామం కావాలి సెలవులు రావాలి

వలస పక్షులు సొంతగూటిలో కాస్త సేదతీరాలి
కల్మషమెరుగని స్నేహాన్ని కలిసిరావాలి
ఆశగా యెదురు చూస్తున్న అనుబంధాల తీగను
ఓసారి తడిమి రావాలి
సెలవులు రావాలి

మనసులన్ని మనసారా మాట్లాడుకోవాలి
ఇష్టంగా చెప్పుకునే ముత్తగారింటి ముచ్చట్లకు
ఊరే ఊవిల్లు ఎగిరే బుజాలు తోడవ్వాలి
నట్టింట్లో నర్తించే పండగ పబ్బాల నరనరాల్లో నాటుకుపోయే
నూతనోత్సహాన్ని నింపిపోవాలి

సెలవులు రావాలి
అలసటను ఆదమరచి
ఆనందపరిమళాన్ని ఆస్వాదిస్తూ
జ్ఞాపకాల సందూకును గుండెలకు హత్తుకు పోయేందుకు
అప్పుడప్పుడు చుట్టపు చూపులా వచ్చిపోవాలి
సెలవులు రావాలి

# బ్రతుకంటే

నలిగే ఆశలను నయనాలు
నడిరేయిలో కూడా నెమరువేసుకుంటున్నాయి
గుండెలో ఉన్న దండి చెరువుకు గండివడ్డట్టుంది
కనుపాప కట్టను తెంచుకొస్తున్నాయి
చేదు గింజలను గొంతు ఎప్పుడు మింగిందో
మింగలేక కక్కలేక కొట్టుమిట్టాడుతుంది

బ్రతికుండగా అనుభవించే కష్టమే నరకం
అంటే కొట్టిపారేశాను గాని
మంచిని ముంచేయాలని
ఆలోచనల పరదాను
అనాలోచన ఎప్పుడు కమ్మేస్తుందో అని
ఉక్కిరి బిక్కిరి చేసి ఉప్పెనై ఉప్పొంగాలనే కాసుక్కూర్చున్నా
దు:ఖానికెంత ఉబలాటం

ఎన్నో తనువుల జీవితాలను
తలకిందులు చేయాలని
ఆవేశమెంత అప్రయత్నంగా ఉంటుందో

కోపానికెంత తాపం బాధను భస్మీపటలం చేయాలని
చిరునవ్వులు పూయించే ఎన్నో పెదవులు
పైకి చెప్పుకోలేని మాటలెన్నో

అనుభవిస్తున్న నరకాన్ని నరికేయ్యలేక
నిశ్శబ్దం చేతితో నలిగి నలిగి
నిలువునా కూలిపోయిన జీవితాలెన్నో
నిలువలేని న్యాయం కోసం
నీరుగారిపోయి
నేల ఒడిన రాలిన పూవులెన్నో

కమ్ముకున్న కాలం కౌగిట్లో
కాలిబుడిదైన సంతోషాలెన్నో
బ్రతుకంటే ప్రతి ఒక్కరికి
అంచనాల చేతికి అతిసులువుగా దొరికే అమాయకత్వం కాదు

అవరోదాల వీధుల్లో
అంతుచిక్కని దారుల్లో
అకస్మత్తుగా అప్పటికప్పుడు మునిగితేలే సంద్రపు అలలే కదా..!

# పుస్తకం

నిన్న ఓ గ్రంథాలయానికెల్లా
చేజిక్కిన పలు పుస్తకాలు పురి విప్పగానే
నయనాలు నాట్యమాడాయి
అక్షరాలు మాత్రమేనా అవి
దోసిట్లోపడ్డ దోరజామపండ్లు,
చీకట్లో చిగురించిన చిరుదివ్వెలు
అది ఎవరో మహాకవి నారుమడి అది
కమ్మలు తిరగేస్తూ
కమ్మని పదపరిమళాన్ని ఆస్వాదిస్తుంటే
ఊరేఊట చెలిమిలోన చేజిక్కిన తేట నీళ్ళలా
వేవేళ ఆలోచనలు వెల్లివిరుస్తున్నాయి
కొత్తకొత్త కోణాల్లో నుండి కృతి మనసు కనుమల్లో
కోయిలై కూస్తుంది.
ఎన్నెన్నో పుస్తకాల మకరందాన్ని పీల్చుకున్న తూనీగనై
నా డైరీ వృక్షాన, ఓ పేజీ కొమ్మపై
తీపి కావ్యాల తెట్టెను పెట్టుకున్నాను
రేపటి కాలానికి తియ్యదనాన్ని పంచాలి కదా!
మరో జన్మంటూ ఉంటే మంచి పుస్తకమై పుడతా
నన్ను చదివే ప్రతినోటికి
మకరందాన్ని ఆనందంగా అందిస్తా!

# ఆటలు

బతుకు బరిలో దిగాక
ఆటలాడక తప్పుతుందా...

చిక్కుల అలలకు ఎదురీదుకు వెళ్లడమే స్విమ్మింగ్
ఎన్ని సార్లు తిప్పికొట్టినా
మళ్ళీమళ్ళీ వచ్చే సవాళ్ళే వాలీబాల్

నిలువునా నిన్ను చుట్టుముట్టి
మట్టుబెట్టాలని చూసిన చీకట్లను చీల్చి
చిన్ని కిరణమై తిరిగి వెలగడమే ... కబడ్డీ
అలుపెరుగని కాలంతో పోటీపడి
కసికసిగా కదిలి వెళ్ళటమే... పరుగు పందెం

గెలుపు తలుపు తట్టమంటు
నిరీక్షించు గుండెకు ప్రోత్సాహమృతం.. అందివ్వడమే
ఈ కదనరంగమందు కష్టాల కాల్వను దాటుకుంటూ
వెళ్ళటమే.. హైజంప్ / లాంగ్‌జంప్
జీవిత వేదికనెక్కాక
ఈ నిత్య నృత్యాలు చేయక తప్పదు కదా..!

# పాపెడ

అట్టడుగున చేరి మట్టిలో కలిసిపోతున్న
ఆచార సాంప్రదాయాల జాబితాలో
ఈ మధ్య పాపెడ కూడా చేరింది

మన తల పొలమును దున్నేందుకు
దువ్వెన నాగలైపోతుంది
బాల్యంలో మా సోదరుడికి
పారేనీటికి కట్టిన కాలువలా
ఎడమ పక్కన పాపెడ తీసి దూసేది అమ్మ

మంచితనాన్ని ముంచెత్తుతూ
పద్ధతికి పట్టంగట్టినట్టుగా కనిపించేది
ఆ క్షణంలో మనసంతా మురిపాల వర్షంలో తడిసేది

ఫ్యాషన్ పేరుతో రంగుల పొంగులు వెదజల్లుతున్న
ఈ కాలంలో ఏ తలను చూసినా
బోడి గుండుపై మొలిచిన
బోడగాకరకాయ ముండ్లలా (ముళ్ళలా) కనిపిస్తున్నాయి

తొలిసంధ్యలో పొడిచిన పొద్దులా
పాపెటి సౌధానికి మొదటి భాగంలో
సిందూరాన్ని సగౌరవంగా ఆహ్వానించి
ముత్తైదుతనానికి పెద్దపీట వేసింది

కొత్తగా వచ్చిన ఈ పఫ్‌లన్ని
పాపెడను పక్కకు నెట్టేసి
ఫ్యాషన్ పేరుతో పాతుకుపోయాయి
దారులు మూసి దట్టంగా మొలిచిన అడవిలా
తారసపడుతుంది

సమాజానికి
పల్లెటూళ్ళని చిన్నచూపు చూసే లక్షణం
ఏ వెదవ అంటగట్టాడో గాని
పాపెడ కనిపిస్తే చాలు
పల్లెటూరు పల్లెటూరు అంటు
వెక్కిరింతలకు రెక్కలు తొడుగుతున్నారు

ఏం చేస్తాం లేండి కలికాలం
అయినా కలియుగంలో కదిలే కాలమంతా
కలికాలం కాకపోతే
'కనకం' కాలం అవుతుందా !

# గొంగడి

తరాలు మారినా తరగని నేస్తాలు
తాత గొంగడులు
పట్టపగలు ఆ వేసవి విసిరిన గాలి
తనువును నిలువునా చుట్టేస్తుంటే
తయిమాయి అయిన తాతప్రాణంకు
తల గొడుగులా మారింది

తడిపే చమటలను తరిమేందుకు
చల్లని చెట్టు పంచిన
చిరుగాలి కౌగిలింతలా తాత తలను కప్పేస్తుంది

శీతాకాలం మంచు ముత్యాల గాలిరాలగానే
చంకనెత్తనివ్వకుండా చలి చక్కిలిగింతలు పెడుతుంటే
అవ్వ కప్పుకున్న కుంచెకు ధీటుగా
తాత తలపై నిలిచి
వేకువలో భోగి మంటలు పంచిన
వెచ్చదనంలా ఊరటనిచ్చింది

ఋతువుల మతి చెడేటట్లుగా
వాటికి వ్యతిరేకంగా పోరాడుతుంది

అయినవారికి పంచే ఆత్మీయతలా
తాత భుజాన చేరి

తాతకు తానున్నానని ధైర్యం చెప్పి
దర్జాగా నడిపిస్తుంది
కొండకోనలు గానక వచ్చిన నిద్దరకు
చెదిరిపోవద్దని చెప్పి
తనని తాను పాన్పులా పరుచుకుని
తాత కంటికి కమ్మని కునుకునిచ్చింది
తాత కూర్చునే ప్రతీచోట పలంగీలా మారింది

తాతకైతే గొంగడిలేని నిమిషం
అంగడంగడిలా వుంటుంది
నమ్మిన వారి కంట నలుసు చూడలేనని
దిష్టి తగలకుండా గాలి సోకకుండా
గొంగడి తన ఒంటి నుండి ఒక పోగైనా
కాలికి కట్టుకోమంది

ముసలితనం ముంచుకొచ్చిందని
కసాయి కొడుకులు కసురుకున్నా
కాటికి చేరేదాకా కాదనకుండా
తాత పక్కన పంచకు పడివుంటుంది

చివరికి
మన పుట్టుపంచలనాడు కావల్సిన
అసలైన చుట్టం కూడా పుట్టుగొంగడే

# మాట

ఎద పరిమళాన్ని ప్రపంచానికి పంచే వారధి...
దేహా రథాన్ని దేదిప్యమానంగా నడిపించు సారథి.. మాట

కొన్ని సార్లు
మాటల తడి తగిలితే మనసులు వికసిస్తాయి
మరికొన్ని సార్లు
మాటల సుడులు రగిలితే జడివానలు తలపిస్తాయి

ఆటుపోటుల జీవితంలో మాట ముందంజలో నిలుస్తుంది
అబ్బ..!
మాట ఎంత చురుకైనది

హృదయ వీణను మీటే
ప్రతిమాట మంత్రమైతది
ఎదకోతలు పెట్టే మాట
పెను మంటై పోటెత్తుతది
అబ్బ..!
మాట ఎంత పదునైనది

స్పర్శ తగలకుండా గాయాలు చేయటం
ఎంతటి గాయాన్నైనా మాయం చేయటం
తనకు వెన్నతో పెట్టిన విద్య
అందుకే...

మాటిమాటికి మాటల్లోమాట
మేటైన మాట మన మాటల్లో మూటలా
మన మాటు నుండి ఉప్పొంగాలి

అప్పుడు
ఆ మాటే నిన్ను సాటిలేని మనిషిగా తీర్చిదిద్దుతుంది
ఆ మాటే నీకు తోటి మనసులలో ఆరాధనలు
అందిస్తుంది
అబ్బ మాట ఎంత చక్కనైనది

# పసి మొగ్గలు

కామాందుని కళ్ళల్లో
తీరని దాహమై కోడెనాగువై
కాటువేస్తానంటు
కామం కోరలు చాస్తుంటే
ఈ ముళ్ళ నడుమ మొలకెత్తిన మొగ్గలకు రక్షణ ఏది..?

నాడు గడపదాటనిది
నేడు కడుపునైనా దాటుతుందా..?
హు...
ముసురుకున్న నల్లమబ్బుకేమెరుక
అసువులు బాసిన పసిదాని విలువ

మనిషిననే ముసుగు తొడిగి
మృగాలు దూసుకువస్తుంటే
రక్తాశ్రువులు చెక్కిల్లను పొక్కిల్లు చేస్తుంటే
సత్తువ పడలి నెత్తుటి మడుగుల్లో
మొలకెత్తిన ఆశోకం
భూమి ప్రకంపించేలా ఆ బాధ భస్మీపటలం అయ్యేలా
అష్టదిక్కులా చెవులు మారుమ్రోగేలా
గొంతెత్తి విలపిస్తున్నది

చిగురు తొడిగిన రాక్షసత్వాన్ని
తుడిచి పెట్టమంటున్నది
అడుగంటిన మానవత్వాన్ని ఆదుకొమ్మంటున్నది

కామం అనే కుబుసాన్ని విడిచిపెట్టమంటున్నది
చేతులు జోడించి విడిచిపెట్టమంటున్నది
విడిచిపెట్టమంటున్నది

# జీవధార

పట్టపగలు నేల రాలిన
పండు వెన్నెల నూవు (నీవు)

నేల శిశువు గొంతులో పాలధారవై
పంటపొలాల పాలిట అమృత భాండమై
పళ్ళుజడలను వీడి పయనమై వస్తావు

నీ రాకతో కమ్మని వాసనని చిమ్ముతూ
ఈ మన్ను పూవైపోతుంది
ముత్యాపు చినుకులా వచ్చిన నీవు
ధరణి మెడలో పచ్చని పతకమై నిలుస్తావు

నేలతల్లికై నింగి ఒలికించిన ఓ ప్రేమధార
ఎండిపోయిన చెరువుల గుండెలను
ఆత్మీయంగా ఆలింగనం చేసుకునే అమ్మవి నీవు

వ్యత్యాసాలను కూడా నిత్యవసరాలుగా
వాడుకునే వాళ్ళున్న ఈ రోజుల్లో కూడా
సర్వప్రాణుల పట్ల సమానంగా స్పందించే
సద్గునవతురాలివి నీవు

నీ దారిలో చిల్లులు చేసే ముళ్లేన్ని ఉన్నా
వెనుదిరగని వేకువవి నీవు

నీ పయనం సాగనినాడు
హోలికుని గొంతులో హాలాహలం ప్రవహిస్తుంది
పరిమళించాల్సిన ప్రకృతి కూడా
బిక్కుబిక్కుమంటు వెలవెలబోతుంది
నేల తల్లి గుండెపగిలి వెక్కివెక్కి ఏడుస్తుంది

అందుకే
మూగబోయిన గుండెలు మోగించే
వసంత రాగమై
ప్రతి గొంతులో నీవు పల్లవించాలి
నీ రాకపోకలతో అల్లుకున్న మన బంధం
తొలి పొద్దై వికసించాలి

# నిత్యఉగాది

జ్ఞాపకాల పొరను పట్టి
గతమంతా తవ్వుకున్నాను
ఎప్పుడో కూలిపోయిన ఆశల కోటను
కన్నీళ్ళతో తడుముకున్నాను

మెత్తనైన నా చిన్నిగుండె పై
ఈ ఇడుములు ఓ వైపు చురకత్తులై నిలిచి
మరువైపు ఉవ్వెత్తున ఎగిసిపడు ఉప్పెనై
హృదయాన్ని కుదిపేస్తుంటే

నా నయన పర్వతం నుండి ఉప్పొంగు ఈ కన్నీటిలావలో
తడిసి తడిసి నిమిషం...నిమిషం
నాలో నేను దహించుకుపోయా

రేయి రెక్కల కింద రాతిశిలలా మారిన
నా జీవితాన్ని చూసుకుంటూ
అరిచాను...అరిచాను..
నా అంతరంగాన నన్ను నేను నిలదీసుకున్నాను

గుండెలోతులలో చొరబడ్డ గడ్డపారను
గుండుసూదిలా తలచి (తీసి పక్కనపెట్టి)
మళ్ళీ పడకను ప్రారంభించాను

చిరునవ్వుల తోరణాన్ని కట్టుకుని
నాలో మమకారపు మకరందాన్ని
నాకెదురు పడే ప్రతి ఒక్కరికీ
నిష్కల్మషంగా నివేదించాను
ఎదుటి వారి కళ్ళలో ఆనందాన్ని పూయించాను

అప్పుడే
అప్పుడే తెలిసొచ్చింది నాకు
షడ్రుచులను జీవితాన్ని
ఒడిసి పట్టిన పాత్రే మనిషని

ఇది తెలిసిన నాడే ప్రతి ఒక్కరి జీవితంలో
నిత్య ఉగాదులు వికసిస్తాయని
తమ సొంతమై వసంత కోయిలలు కూస్తాయని
అప్పుడే…
అప్పుడే తెలిసొచ్చింది నాకు

# చీలం జానకీబాయి

బీళ్లుగా పడిఉన్న జీవితాలలో
కుండపోతగా వచ్చిన వెండి వానవైయ్యావు
పేదోల్ల కంచంలో కూడువైయ్యావు
చీకటి గుడిసెల్లో దీపమయ్యావు

పల్లెలెన్నింటినో ప్రగతి పథంలో నడిపించి
శత్రువుల గుండెల్లో గుబులు పుట్టించి,
మరో మణికర్ణికవై నిలిచావు
పౌరుషానికి నీవు తలకట్టువైయ్యావు

నీ హాయాంలో
అభివృద్ధి అలుగై పారింది
ప్రత్యేకతను సంతరించుకున్న నీ పరిపాలన
బానిసత్వానికి గొడ్డలిపెట్టు

పయనమై నీవు వస్తుంటే
నీ వెంట పగటి దివిటీలు పడగ విప్పిన నాగులై
నిన్ను కాచేవి

ఎన్నో చరిత్ర పుటలు
దోచుకున్న దొరలను గురించి చూపించాయి గాని
దాచుకున్నది పెట్టీ నీ గురించి మాత్రం

ఏ కలం కదలలేదు
ఏ గలం గొంతువిప్పలేదు
ఏ పుస్తకం పురివిప్పలేదు
అందుకే కదా...
నియతున్నోడికి అన్నం లేదంటరు

అయినా
చెరువుల గుండెలు మీటుతూ
ఉప్పొంగిన ఆ వరద గానం
నేటికి నీ పేరునే పల్లవిస్తుంది.
పసిడి వర్ణపు తొడుగులో దాగివున్న
ప్రతి బియ్యాపు గింజపై
నీ పేరే నిలిచివుంది

రామ రాజ్యాన్ని తలపింపజేసిన
ఓ కలియుగ జానకీ
అక్షరాంజలి తెలుపుతున్న చల్లని నీ పాదాలకి

# ఎన్నికలు

మావూరికి ఎన్నికలొచ్చాయని
సంస్కారము లేని ఓ మనిషి సాధువైనట్టు
నమస్కారము చేతుతో పట్టుకుని
నడుచుకుంటు నా ముందుకొచ్చాడు

పాములు పట్టేవాడు ఊదే ఫ్లూటులా
పచ్చనోట్ల పరిమళాన్ని
నా వెర్రిచూపులకు చూపి
నన్ను బుసకొట్టని నాగును చేసి
బుజ్జగించి బుట్టలో వేసుకున్నాడు
ఆ సమయాన ఆయన చెయ్యి నా కంటికి

నట్టింట్లో నోట్ల కట్టలు నాటుకున్న
నరుడి బంగారు పొట్లంలా కనిపించింది

ఆయన మనసులోని మాటను
నా మనసుకు హత్తుకునేలా చెప్పేందుకు
మందు సీసాలు ముందుకొచ్చాయి
కోటరు కొలనులో మునిగితేలాను

తడిసిన చేతులతో
పార్టీజండా పట్టుకుని
ప్రతి వీధిలో కాలుష్యమే కసురుకునేలా పాతేసా

మా నాయకుని పై పాటను
కోకిల రాగంగా చేసి
ఊరిలో ప్రతి కొమ్మనెక్కి కూసా

ఎన్నికలు పూర్తయ్యాక నా పరిస్థితి
వడ్ల కుప్పలోంచి బయటపడ్డ తప్రలా
ఆయుధంలేని అమాయకపు సైనికుడిలా మారింది

పింఛనిస్తారని వెళితే
దరఖాస్తు పేరుతో దాగుడుమూతలు ఆడుతున్నారు
ఇదేమిటయ్యా అని ప్రశ్నిస్తే
లంచాన్ని లాంచనంగా ఇవ్వాలని

చాటుగా చెప్పారు
కొందరైతే...
దండించే వారు లేరని
లైసెన్సులేని వాయువులా
వేగాన్ని పుణికిపుచ్చుకున్నారేమో (బహుషా..!)

అందుకే కాబోలు
వారి వాహనాలు ఈ మధ్య
నేలపై నడిచే విమానలైయ్యాయి.
ఇక ధరలు వేసే ధరువులకు
దావఖాండ్లలో రోగాలకు తెరదించేవారే లేరు

పాలించేవాడు పాపాత్ముడైతే కాలం కూడా కలిసిరాదంటారు
వీడిని సమర్థించి గెలిపించిన నన్నేమంటారో మరి.!

అయినా ఓటును ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా
వేసిన నేనే దీనికి కారణం
అందుకే అన్నారు
చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే
ఏం వస్తుంది అనీ

# తెలంగాణ

ఆర్తీగీతం విలపిస్తున్న నేలతల్లి
దాస్య విముక్తికై పోరు దారినెంచుకుంది

పచ్చని పైరునేగాదు
ఎర్రని మొదుగు పువ్వులను గూడా
కడుపునిండా గనుకున్న నా తెలంగాణ

నెత్తుటి పొత్తిల్లలో
ఎత్తిన పిడికిల్లలో
బోనమెత్తిన శివసత్తె శివమెత్తి ఊగింది
మసిబారిన యెదల చీల్చే
వసంత మేఘమై గర్జించింది

భగ్గుమన్న మా అగ్ని పిడుగులు
నేలతల్లి కంట పొంగుతున్న నెత్తుటి చారలు
చెరిపేందుకు ఉరకలెయ్యంగ
ఆ పోరు అలుపెరుగని ప్రవాహమైంది

పల్లెపల్లెనా కథంతోక్కి పదంపాడి
డప్పుచప్పుడై ఉద్యమించింది

నిన్న ఉద్యమానికి ఊపిరిపోసిన
అమర వీరుల త్యాగఫలం

ఏడు రంగుల సింగిడై
నీలినింగి సిగలో పూయంగ
నేడు చీకటి రెక్కలు విరుచుకుంటు
పైపైకి లేచిన తొలిపొద్దై వికసించింది
జై తెలంగాణ...జై తెలంగాణ

# నానమ్మ

అస్తమించని సూర్యుడై
ఆమె కస్తూరి కనిపిస్తుంటే
కరుణ గురిసే ఆమె కన్నులు కాంతి పుంజాలై వికసిస్తుంటే
అంచు చీరలనెంచుకుని మరీ కట్టే నానమ్మ
కదిలే అమ్మవారై దర్శనమిచ్చేది

నాన్న రక్షణ, అమ్మ శిక్షణను కలగలిపిన
తొలి మధురిమ ఆమె
నా బ్రతుకుబాటలో సంస్కార బీజాలు నాటిన
తొలి దివ్యహస్తం తాను

పెనుచీకట్లను పెల్లుబీకిన లావాలను
అదిమి పట్టిన ఆమె అనుభవం మాకు
స్ఫూర్తిదాయకం

ఇంటి దగ్గరున్నప్పుడు
అలా బయటికి వెళ్లామంటే చాలు
మాటి మాటికి మా వీధిగుమ్మం వైపే
ఆమె చూపులు పరిచేది
మరి ఇంట్లో ఉన్నామంటే
మా వంటింటి ఘుమఘుమలతో మిమ్మల్ని ముంచెత్తేది

తన చేతి గోరుముద్దలకై
అన్నయ్యకు నాకు పెద్ద యుద్ధమే జరిగేది

ఆరుబయట పడుకుంటే చాలు
ఇతిహాసాలను ఇంపుగా చెప్పే శుకమహర్షి అయ్యేది
ఇంత చేసిన ఆమెకు ఏమిచ్చి ఋణం తీర్చుకోగలం
మా కౌగిళ్ళు శాలువాతో తనను సన్మానించటం తప్ప
ముద్దుల మెమోంట్లను అందించటం తప్ప

హు...
ఎంత తడిసిన విసుగురాని ఆమె వాత్సల్య వరదలో
తడిసి ఎన్నాళ్ళవుతుందో....
ఏదేమైనా

ఈ సారి సెలవుల్లో మాత్రం
ఖచ్చితంగా తనను చూడాల్సిందే
వెచ్చనైన ఆమె అనురాగ పరిమళాన్ని ఆస్వాదించాల్సిందే

# మరణశాసనం

సస్యశామలమైన ధారిత్రి కళ్ళలో
నేడు రక్తాశ్రువులు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి

పదునైన సీత కన్నీటి బొట్టు
రావణ కాష్టానికి పునాదులు వేసింది
ద్రౌపది ఆక్రందనతో కురుక్షేత్రం మొగ్గతొడిగింది
అంటూ...
చరిత పుటలు ఎంత పచ్చని పాఠాన్ని మొలకెత్తించినా
ఇంకా నేలమీద
అసురులు ఉసురు పోసుకుంటూనే ఉన్నారు

అందుకే మళ్ళీ చెప్తున్నా
నేల కనిపించనంత వరకే కొండ నిలకడ
అలలు అనిగి ఉన్నంత వరకే పడవ పయనం

జగతి ఒడిలో జారిపడుతున్న ఆ అతివల కన్నీళ్లు
వేటాడే నాటుకొడవల్లై మరణ శాసనం లిఖిస్తాయి
నెత్తుటి ప్రవాహాలకు దారి తీస్తాయి

# కవితా బతుకమ్మ

నా చేతి పాత్రపై
నోట్‌బుక్ చిగురింతై చిగురించంగ
కాగితం బీరాకై పరుచుకుంది

మా బడిలో పూసిన
అక్షరపూలను తెచ్చి
పదాల తంగేళ్ళతో
భావాల గుణుగుతో
కవితా బతుకమ్మను పేర్చుకున్నాను
కన్నుల పండగ జరుపుకున్నాను
ఇక దీన్ని
నా డైరీ చెరువులో వేసుకుని
పండగను పరిపూర్ణం చేసుకుంటాను

# కొత్త పుస్తకం

మొన్న ఇందూరులో
మా కవన బంధువర్గం వారి పుస్తకావిష్కరణ
అంటే వెళ్లాను

కొత్త పుస్తకం చేతికొస్తుందని
మనస్సు పురివిప్పిన వసంతమైంది
ఆ పుస్తకం నా చేతికందగానే
నెమ్మదిగా చదువటం ప్రారంభించాను

అబ్బ...!
ఏం పుస్తకమండీ అది
అక్షర రెక్కలతో వికసించిన పదపుష్పాలు
భావ పరమళాలను భలే విరజిమ్ముతున్నాయి.
ఒక్క పుస్తకోద్యానవనంలో
ఎన్ని రంగుల సుమాకృతులో

మరోవైపు
ఓ కవి గొంతునుండి
కవితా ప్రవాహం పరుగులు తీస్తుంటే
తడి ఆరిన లేత గుండెకు
మేత దొరికినట్టైంది

అబ్బ...!
ఏం పుస్తకమండీ అది
ఆ కవికలం జలమై
కవిత్వం ప్రవాహమై సాగినట్టుంది

అందుకేనేమో...
అందుకేనేమో బహుషా
మునపటి నా మెదడు బీడు
ఉన్నట్టుండి నేడు చేతికందిన పంటైంది

ఇంకేం
ఈ సాహిత్య ధాన్యాన్ని పుస్తక సంచుల్లో నింపుకోవాల్సిందే
తెలుగు తల్లికి నీరాజనాలర్పించాల్సిందే...

# పయనం

ఎగసెగసి పడుతున్న
ఎద మొదళ్లను చించుకుని
వీడని వేగాన్ని వెంటబెట్టుకుని
ఉప్పొంగి ప్రవహిస్తున్న
ఈ కన్నీటి నదిని
నా బతుకునావ పాదాల కింద
వారధిగా మలుచుకుని
నడుస్తా నడుస్తా తప్పకుండా నడుస్తా...

ఇడుముల తనుగుని తెంచుకుని
చెంగు చెంగున దూకి వస్తున్న ఈ లేగదూడను చూసి
గమ్యం జేగంటలు మోగించే పాడి ఆవై
నను పట్టుకుని తరించేలా
నడుస్తా నడుస్తా తప్పక నడుస్తా...

మేకులు కొడితే వేకువలాగనప్పుడు
నేను మాత్రం పడినచోటే ఎందుకు పతనమవ్వాలి

కాంతి కలశం తొలికితేనే కదా
కటిక చీకటి కళ్ళు మూసేది

కట్టలు తెంచుకు వస్తేనే కదా
వరద జోరు తెలిసేది

# సింధ్‌దాయి సబ్కాల్

నిండైన తెలుగుదనంతో నిండిన
నిలువెతు పండగ ఆమె
షడ్రుచులహారం
ఆమెకు అసలైన అభరణం

కాలం చిమ్మిన విషాన్ని
స్మశానంలో పాతేసి
చితిమంటల సాయంతో
ఆకలిమంటలనార్పుకున్న ఆ ధీరత్వమే
తన విజయైరావతానికి తొలి పునాది

దీనులైన ఎందరో పసిగువ్వల గుండెల్లో
తాను ధైర్యమై నిలిచింది
వారికి దారి చూపేందుకు
తాను కాగడై కదిలింది
తన శ్రమచమురుతో కాంతులీనిన బ్రతుకుదీపికతో
వేల జీవితాలను వెలిగించింది
కాలమనే తోటలో
ఆనంద పరిమళాలను వెదజల్లిన ఆ పసిడికుసుమం
నేడు ఎందరికో ఆదర్శమై వెలిగింది
అలా బ్రతుకు పాత్రలో ఉన్న రుచులు
పచ్చడులని తలపిస్తే
చరితపుటల నడుమ అవి పండగలై నిలుస్తాయి
ఉగాదులై కనిపిస్తాయి

# తెలుగు టీచరు

మా తెలుగు టీచరు
జ్ఞానకాంతినొసగేందుకు
తరగతుల కొండల్లో నిత్యోదయమై వికసిస్తుంది

ఆమె మా తెలుగు టీచరే కాదు
కదిలే తెలుగు తల్లికూడా
ఒక చేత పుస్తక కలశాన్ని
మరో చేత కాలమనే ..గొలుసును పట్టుకుని
నిరాడంబరతకు నిలువెత్తు రూపమై సాగుతుంది
అందుకే
అనురాగలతలనల్లుకు పూసే ఆమె మాట
మాకు పెరుగన్నం చద్దిమూట

ఆమె చేతిలో చిక్కితే చాలు
నల్లబల్లమడిలో సుద్దముక్క నాగలౌతుంది
ఆ చేతితో అక్షర విత్తనాలు చల్లిందంటే చాలు
ఇక మా చదువుల పంటకు సాహిత్య ధాన్యానికి
కొదువెక్కడిది

అలా కాసేపు కూర్చుంటే చాలు
యతిప్రాసలను రెండు పోగులదారానికి
పదాలపూలను చుడుతూ
పద్యమాలను అల్లుతుంది

ఎదిగే ఈ వయస్సులో
మా ఆలోచనల పొదుగులొంచి
అద్భుతాలను పిండేందుకు
అవకాశపాత్రను అందిస్తుంది.
అందుకే అనిపిస్తుందేమో
టీచర్స్ డే రోజు మాత్రమే కాదు
నిత్య జీవితంలో
నిజంగా తెలుగు టీచరే అవ్వాలని
తెలుగు తల్లికే జేజేలు కొట్టాలని

# అశరీర

విశాలంగా ఉన్న ఓ ఉద్యానవనంలో
పచ్చికబయల్ల మీద
అటూ ఇటూ తిరుగుతున్న తెల్లపావురంలా
ఆమె అతనికోసం ఎదురుచూస్తున్నది
అతని చేతి కుంకుమ ఆమె పాపిటలో పూయిస్తాడని
ఒంటరైన తన బతుకుకొమ్మపై జంటపక్షై ఉంటాడని
కలలన్నీ కళ్ళలో దాచుకుని ఎదురు చూస్తున్నది

అలా కాసేపటి తరువాత
ఆమెకు కొద్ది దూరంలో ఉన్న ఓ చెట్టుకింద
చాటుగా ఓ పిచ్చివాడు కూర్చున్నాడు
చినిగిన బట్టలు, చెరిగిన జుట్టుతో,
దు:ఖాన్ని గొంతులోనే బిగబట్టి
బిక్కుబిక్కుమంటూ చూస్తున్నాడు
అతని ఒంటినిండా గాయాలు
గుడిలో ప్రసాదం దొంగిలించాడని
అక్కడి జనం అంతా కలిసి
ఆ పిచ్చివాడిని చితకబాదారు
అయినా..
తన పిడికిలిలో ఉన్న పులిహోరను మాత్రం
భద్రంగా దాచుకుని చాటుగా తింటున్నాడు
కాసేపు ఆమె అతడిని గమనించింది
ఇంతలో...

ఆమె హృదయం బద్దలు అవుతుంటే
ఓ వైపు కన్నీళ్ళు ఏరులై పారుతున్నాయి.
ఆమె అడుగులు తడబడుతున్నాయి
ఆశలు ఆవిరి అవుతున్నాయి
అతడిని ఆ స్థితిలో చూస్తానని
ఆమె అనుకోలేదు బహుషా...

అతడి వద్దకు వెళ్లి తన చేతితో
అతడి తలను నిమిరింది
కానీ అతనికి స్పర్శలేదు
గుండెలు బాదుకుంటూ ఏడ్చేస్తుంది
కాని అతనికి వినిపించటంలేదు
అమాంతంగా కౌగిలించుకుంది
కాని తన చేతికి చిక్కటంలేదు
ఇంతలో ఆమె కాస్త కంగారుపడింది
కానీ...
తొందరగా ఓ విషయం గుర్తు తెచ్చుకుంది
కొద్దిరోజుల క్రితమే
ఆమె శరీరాన్ని విడిచి వెళ్లిందని...!

# ఆడపిల్లలం

బతుకు బడిలో పయనించే
నిరంతర విద్యార్థులం.. ఆడపిల్లలం

వంటావార్పుల చదువులు
పుట్టింటినుంచి మొదలు మాకు
మా నిత్య హోంవర్క్‌కి
సెలవంటూ ఉండవు

మా వంటిల్లే మా పరీక్షాకేంద్రం
ఖాళీపాత్రలే ఆన్సర్‌షీట్లు
ప్రశ్నమంటకు మేము వండిన జవాబు పదార్థాన్ని
ప్రతి ఒక్కరు తిన్నాకే రిజల్టు ఇస్తారు

రుచులమార్కులు సరిగ్గా రాలేదో
అమ్మవేసే మొట్టికాయతో
నాన్నపెట్టే చివాట్లతో
కడుపు నింపుకోవాల్సిందే

చివరికి మా విద్యకాస్త మెరుగుపడి
మంచి ఉత్తీర్ణతా శాతంవచ్చాక
మావాళ్లు మంచి సంబంధ నోటిఫికేషన్‌చూసి
దరఖాస్తు చేయటం ప్రారంభిస్తారు
ఎన్ని దరఖాస్తులు చేసుకున్నా....

దాంట్లో హైటు, వెయిట్, అందం అనే
నిబంధనలు తప్పనిసరి ముందుగా తెలియజేస్తారు..

అంతేలే
మేకప్ వేసుకున్న మనిషి కావాలిగాని
ముసుగులేని మనసు ఎవరికి అక్కర్లేదు కదా
ఇక పెళ్లిచూపుల ఇంటర్వ్యూకి వచ్చేసాక
లంచాన్ని కట్నంగా కడితేనే
కాపురోద్యోగానికి అర్హులు అంటారు
వచ్చేది పర్మినెంట్ పోస్ట్‌కాబట్టి
కావాలని కట్టుకోలేం
వద్దని వదిలేయ్యలేం
మా నిర్ణయాలకు నీళ్లొదిలేసి
మా ఇంట్లోవాళ్లపై భారం వెయ్యటంతప్ప

# ఉగాది

ఉగాది అంటే
ఏడాదికోసారి వచ్చేపోయే పండగే అనుకున్నా..
కానీ..
జీవితమంటేనే ఉగాదని ఆలస్యంగా
తెలుసుకున్నా...
అవును...
జీవితమంటే ఉగాదే
జీవితమంటే ఉగాదే

మానవత్వపు చిగుల్లు విచ్చుకున్నప్పుడే
మనిషి వృక్షం ఎదుగుతుంది
శాంతితోరణం గుండెగడపకి వ్రేళ్లాడినప్పుడే
ప్రతిబ్రతుకు పండగవుతుంది
జీవితమంటే ఉగాదే
జీవితమంటే ఉగాదే

ప్రేమపూర్ణంతో నిండిన మాటపోలెనే
కడుపుని మనసుని కలిపి నింపుతుంది
శ్రమచమురుతో కాంతులీనుతున్న బ్రతుకుదీపికే
పలువురికీ ఆదర్శమై నిలుస్తుంది
జీవితమంటే ఉగాదే

అందుకే కదా
బ్రతుకు విస్తరికి అసలైన నిండుతనం
షడ్రుచులు వడ్డించినప్పుడే వస్తుంది
అవి ఓర్పుతో ఆరగించినప్పుడే
ఆ నిండుతనం కాస్త పండగలా మారుతుంది
అందుకే అనిపిస్తుందేమో నాకు
జీవితమంటే ఉగాదని
ఉగాదంటే జీవితమని

# ఇందూరు

ఎందరో ధృవతారలనుగన్న
నేల మీది పాలవెల్లి మా ఇంద్రపురి
రాజులకాలం నుండే రతనాల ఊట ఇది
దొరలకాలం నుండే సిరుల మాగాణి ఇది
ఎందరో సాహితీమూర్తులను గన్న సరస్వతీదేవి ఇది

అలనాడు
చురకత్తుల్లాంటి వీరులనుదుట
నెత్తుటి తిలకమై వెలిగిన ఈ ఇందుర్తి
స్వరాష్ట్ర సాధన జాతరలో పోతురాజై ముందుకు కదిలింది
అణచివేతల్ని అనిచివేసేందుకు
బరిలోకి దూకిన విప్లవకెరటమైంది
బానిసత్వాన్ని తుడిచి పెట్టేందుకు
ప్రతి గుండెను మేల్కొలిపి ఎర్రజెండై ఎగిరింది

నాటి సిరిసంపదలకే కాదు
పౌరుషాలకు కూడా తలకట్టు ఇది
నేటికి బ్రతుకు జీవిడా అన్నవారికి
అరచేతిలో అక్షయపాత్ర ఇది
నాటినుండి నేటిదాక
స్ఫూర్తిశిఖరంగా నిలిచిన నిజామాబాద్ ఇది

# ప్రియమైన అవ్వకు

ప్రియమైన అవ్వకు
ప్రేమతో రాయునది ఏమనగా
నీవు అక్కడ ఎలా ఉన్నావు
నా సంగతంటావా....
వెల మైళ్ళు దాటివచ్చి
ఎన్నో ఏళ్ళు గడిచాయి కదా...!

ఇన్నాళ్లు
చురుకైన దేహంతో
ఇరుకైన మనసుతో
పాషాలను పాతేసి
ఆదాయమే ఆశయంగా బ్రతికాను
కాని నాడు నేనెరుగలేదు
జీవితం లేడి పరుగైయ్యిందని
ఈ ఆశయం చేజిక్కని నీడైందని
తీరని దాహాగ్నికి నేను ఆహుతినైయ్యానని

రోజు రాసుకునే నా డైరిని ఎన్ని సార్లు తిరగేసి చూసినా
నోట్ల మాటలే గాని
నోటి మాటలు లేవు
కరెన్సీని కబోర్డ్ లో నింపుకున్నానే గానీ...
నా కడుపు లెంకే నిన్ను మాత్రం ఎంతో దూరంలో వదిలేశాను
ఇంకా నలభై యేళ్ళు కూడా నిండకముందే
ఒంటికి పుట్టిన వ్యాధులు బిడ్డలై పెరుగుతున్నాయి

శూన్యాన్ని మనసులోకి ఒంపుకున్నా కదా
మనుషులు కరువైయ్యారు
మనసూ బరువైంది
ఈ చీకటి గదిలో
మాసిన ఎదలో
నే రాసిన ఈ లేఖ నిన్ను చేరుతుందో లేదో గాని
ఇక చాలనిపించిన జీవితానికి
కన్నీళ్ళ సాక వెట్టి
దుఃఖాన్ని పేనిన తాడుకు
గొంతును వెళ్ళాడదీసి
మనో వేదనలనుండి మనస్సును వెలివేసుకుని
చూపులకందని దారుల వెంట
వెళ్ళిపోదామని పయనమయ్యాను కానీ....

అవ్వా.....!
నాకు బలమైన బలగమైన నీ చేతి స్పర్శేగా
ముసురుకున్న చీకట్లచెవులను మెలిపెట్టి
బ్రతుకు పొడవునా వేకువలను వెదజల్లేది నీ మాటేగా
నా నిలువెత్తు సంతోషం కదా నువ్వు
అందుకే నా జీవితంలో మళ్లీ నవ్వుల చివుల్లు విచ్చుకోవాలంటే
అవధులు లేకుండా కురిసే నీ ప్రేమదారల్లో నేరుగా తడివాలని
ఎద గూటిలో ఎన్నెన్నో వసంతాలు ఊపిరి పోసుకోవాలని
సంద్రపు అంచులలో నించుని
ఆశగా ఎదురు చూస్తున్నా....

# ఎంకి

పొద్దు గూట్లో వడ్డదని
సుక్క నోట్లో వేసావు
మాపటేల మత్తులోకి జారి
మనసిరిగే మాటలన్నావు
ఇగురమెట్లజెప్పన్నో సుదురాంచ లేదు
అడ్డపడతల రెండు మాటలని, అరుగు నీకు పాన్పు చేసా...

నాకైతే నిద్ర నా దరిదాపుల్లోకి కూడా రాలేదు
ఒక్క మాటైనా చెప్పకుండా వెళ్తున్నందుకా
తోవ్వ నిండా పరికిముండ్లు
పచ్చి నెత్తురు కోసం పదునైన కత్తుల్లా చూస్తున్నాయి
అడుగడుగునా గండు చీమలే
మంటవుట్టేటట్టు కుట్టేద్దామని మాటు వేసుకుని కూర్చున్నాయి
వరి నాట్లు వేద్దమని వంగి నారు పట్టబోతే
కంటికాల్వ కట్టలు తెంచుకు వచ్చింది

చూడాలని ఉన్నా చులకనవ్వ కూడదని
నా చూపులు నీ వైపు తిప్పనివ్వనందుకేనా...
నా దిక్కు సూడంగనే మునుం ముక్కిర్షింది
నీ ముఖం సూడకుంట వచ్చినందుకేనా....

ఒడవని పని ఒకరితో మాటలనిపించింది
నేను పలకరించలేదని నీవు పచ్చి గంగ ముట్టనందుకేనా

సద్దిగిన్నె వద్దకు రావద్దంది
అయిన మావ ఒక్క మాటజెప్పన్న
సంటి పోరగాడ్ల తిరగ సప్పుడు మనది
కాలమేదయినా కారం మెతుకులు మనయి
కంది ఎలుగైనా సరే
నా కండ్ల ముంగట  నువ్వుంటే దినాము దీపావళే నాకు

# మా ఊరు

మా ఊరు ఆప్యాయతా
అనురాగాలకు
అక్షరాల అల్లికలమాల

అంబరానికి అద్దిన
రంగుల హరివిల్లు చూసి
కల్మషం లేని పసివయసులో
పరుగులు పెట్టిన పసివాడి కేరింతల్లా
కనులను తాకిన కమనీయం మా ఊరు

ఉరకలు వేస్తూ ఉప్పొంగిన
సంద్రపు అలల్లా,
గంధాన్ని పూసుకుని గాలి విసిరిన
సంపెంగ సన్నజాజుల పరిమళంలా,
పచ్చని పైరగాలి విసిరిన హాయి సోయగంలా
పొగమంచు కురిసే వేళలో
పుడమి పై ప్రతి ప్రాణిని నిద్దర లేపే
ప్రభాతరాగంలా నిద్దరలేచేది

ఆవు అరుపులకు
గమ్మత్తైన గంతులు వేస్తూ వచ్చిన
లేగదూడ మెడలో గంటలా
మా గోడమీద గడియారం నడిచేది

పేడసాన్పుతో స్నానమాడిన
మా వాకిలంతా
పచ్చని పంటచేనులా కనిపించేది

నడిరేయి లోని చుక్కలు నేలకు దింపినట్టు
ముగ్గులు ముద్దులొలికేవి

ఒక పక్క వేడినీళ్లతో స్నానాలు
మరో పక్క బడికెళ్లనంటు
పసిపిల్లల సన్నాయి రాగాలు

పక్షుల రాగాలతో
సాగిపోయే సెలయేటి గానాలకు
చాకలి బండ తాళం వేసేది,

కాపొల్ల పొలమంతా
నెరవేరిన కలలా ఇంటి కొచ్చేది

మట్టి కుండలొ వండిన అన్నం చూసి
మల్లెపూవులా మనసు
మైమరచిపోయేది

కమ్మరి కొలిమిలొ ఎర్రబడ్డా కొడవలి పదునైన గొడ్డలిలా కనిపించేది
కోసిన గడ్డిని మేసిన గొర్రెలు,
వాటి తోల్లు గొల్లవాడి గొంగడిలా ఉండేవి

శాలొొల్లు కుట్టిన కొత్త బట్టలు చూసి
ప్రతి కళ్లు మిడిగుడ్లతోమిడిసి పడేవి

పండగ పబ్బాలకు ముందుండే
మాదిగ డప్పు మరపురాని సందడిగా మారేది
వాలిన పొద్దుతొా
అలజడులు లేని ప్రవాహమై
నా పల్లె గువ్వ గూటికి చేరి
నిద్దర పోయేది

# నా మది

మొన్న నా మది గదిలో
మీ మనసు పారేసుకుని వెళ్ళిపోయారు
కాని నేను మాత్రం దాన్ని చాలా భద్రంగా దాచాను

తాను మాత్రం కుదురుగా ఉండకుండా
మీ తలపులన్నింటిని నా తలకి తగిలించి
తీరం లేని దారిలో నన్ను నడిపించింది

నేనెరుగని సంతోషాల చీరను
ఏ సందూకు లోంచి పట్టుకొచ్చిందో గాని
నా ప్రమేయం లేకుండానే నాకు చుట్టేసింది

ఒంటరివి కావని తుంటరి ఆలోచనలు రేపి
అందమైన ఆవభావాలను గుండెకు అద్ది ముద్దాడింది
వలపుల వాకిట్లో వరమాల చేతికిచ్చి మీ కోసం వేచి చూడమంది

తొలకరి జల్లులెన్నో కురిపించి
నా ఆశల రెక్కలకు చిగురుతొడిగి
లెక్కలేనన్ని లేఖలను చిగురాకుల పై రాయించి
విరిసి విరియనీ సిగ్గులన్నిటిని మొగ్గలుగా పూయించి
తలంబ్రాలుగా మీ తలపై పోయమంది

తనతో ఎడబాటు ఎప్పటికీ రాకూడదంటు...
విప్పు కోలేనన్నీ ముడులు
నీలో నేను వేసుకున్నాను
నా అడుగుల్లో నీ పయనం సాగించు
అంటు...

నా హృదయాంతరంగంలో లీనమైపోయింది
తిరిగి ఇవ్వలేను కదా!

అందుకే...
మీకు బహుమతిగా నన్ను నేను
మీకు బహూకరించేందుకు మీ ముందుకొచ్చాను
భద్రంగా దాచుకుంటారుకదూ...!

# భాధ్యత

సమ్మేలు చేసి సంకెళ్ళవేయలేం
బలిదానాలు చేసి బహిష్కరించలేం
రాచపుండు రాజుకుంటానంటే రమ్మని స్వాగతిస్తామా

ఐక్యమత్యమే మహాబలం
ఐక్యమత్యమే మహాబలం అన్నారు పెద్దలు
సొంత గూటిలో సేదతీరి నిరాయుధీకరణ అనే మంత్రాన్ని జపిస్తూ
సమిష్టి యుద్దం చెయ్యలేమా
నమస్కారమంటు సంస్కారపు కంచెలు నాటకోలేమా

ఈ యుద్దంలో
గెలుపు పిలుపునందుకునేందుకు
వైద్యరంగం వారధిగా
రక్షకరంగం రక్షకకవచంగా
నిలిచాయి కదా అని నిర్లక్ష్యన్ని నిలువునా పులుముకోకు

మిత్రమా...!
భగవంతుని ఆశీర్వాదానికై
భాధ్యత అనే పల్లకిని ప్రతి ఒక్కరం మోయాలని గుర్తుంచుకో
నీతో సహా
ఈ పుడమి ఒడిలో పూసిన ప్రతి కుసుమము
ఓ వీర సైనికుడని గుర్తుంచుకో
ఈ కరోనాను కాల రాసే విధాతల జాబితాలో నువ్వు చేరిపో...

# హాలికుడు

బాధ్యతలు యెదకెత్తుకుని
దరిత్రికి తొలి పుత్రుడవైయ్యావు
సమాజానికి సేవకుడవయ్యావు
తనువును తాకినబిడ్డను చూసి
ఈ నేలతల్లి మురిసిపోకుండా ఉంటుందా
పచ్చని పైరై తన గుండె విచ్చుకోకుండా ఉంటుందా

ఓ అన్నదాత నీకు అండగా నిలిస్తేనే కదా
తమ గుండె బావిలో ఆశల ఊటలు ఊరేది
ఇల పై తమ ఆశయాల పంట పండేది
ధాన్య లక్ష్మీకే జీవం పోసే దయామయుడివు నీవు
నీకై మా కలాలు నాగల్లై కదలంగ
అక్షర సేద్యాలను నాటుతూ
వేల హృదయాలను వికసింపజేస్తాం
జయ్ కిసాన్ అంటూ నీ అడుగులకే మడుగులొత్తుతాము
ఓ కర్షకుడా....
పదునైన శ్వేద బిందువే
నానాటికి వ్యాపి చెందుతున్న ఈ కల్తీలను కాలరాయగలదు
అస్తమించని సూర్యుడై నీవు వెలిగినంతకాలం
ఎ అందకారం మిమ్మల్నీ బందించలేదు

# పంచ

పేదోళ్ళ సింహాసనమే పంచ
నేను అలసటతో ఒరిగినవేళ
పంచ మంచమై ఒదిగేది
ప్రశాంతత అన్న మాటకు నిలువెత్తు వేదికైయ్యేది

పసివాళ్ళ పిచ్చిగీతాలకి
నొచ్చుకోని పలకైయ్యేది
వీళ్ళువాళ్లు అనే తేడాలు లేకుండా
అందరి మంచి చెడులను అర్పుకునేటప్పుడు
పలాంగై పరచుకునేది
ముచ్చట్లు ముసురుకునేవేళ
కబుర్లుజెప్పుకునే  కచీర్ అయ్యేది
చివరికి పచ్చీసు కైలాసం వంటి ఆటలు సైతం
పంచపైనే పొంచివుండేవి

అంతేలే...!
పంచ పంచలేని ఆత్మీయతలేమున్నాయి
పంచ పంచని స్మృతులేమున్నాయి

కాని
ఇప్పుడు పోగొట్టుకుంటున్న అతేరలలో
పంచ కూడా ఒకటైపోయింది

# తెలుగు

తేటతెలుగు పూదోట పరిమళాల
పరువాన్ని నా పడకింటికి పట్టుకెళ్లి
దోబూచులాడాలనీ దొంగతనానికి
వెళ్ళగానే....

వయ్యారాలను ఒలికించే
ఆ అక్షరాల ఆకారాలు వాటిని
అరక్షణమైన చూడకుండా ఉండలేని
లక్షణాలను నాకంటగట్టాయి

ఆ క్షణంలో కనులకి
మాటలొచ్చాయేమో బహుశా!
పుస్తకాల పొత్తిలిలొ నయనాలను నిలిపి
పదాల పల్లకి హృదయ ఉచ్చులలో
చిక్కుకునేలాచేసి
అను నిత్యం నెమరువేసుకుంన్నాయి

ఇక మాటలు నేర్చిన మనసు
పదాలు పలికెంత సమయం
పెదాలకివ్వకుండానే
కలం పట్టుకున్న కరమును కదిలించి
సంబరాల సంద్రంలో మునిగితేలింది

హృదయం పలికే ఆ తెలుగు
పదముల పదనిస రాగం ముందు
ఉపద్రవాల శబ్దం నుండి
సిరిసిరి మువ్వల సవ్వడి వరకు
దెన్నైనా వినాలనె ఆలోచన కూడా
నానీడ దరిదాపుల లోకిరాలేదు

హమ్మో......
ఏమిటీ పరిమళం
దీనికి దొంగనే దోచుకునేంత సౌందర్యమా
ఈ గమ్మత్తైన మత్తులో నేను పడుతున్న బ్రమా

# అబ్దుల్ కలాం

ఆయన జీవితం ఓ విజయైరావతం
ఈ పుడమి కడుపున వికసించిన ధృవతార కలాం
కలాం ఎవరో కాదు
ఈ పుణ్యభూమే పుట్టినిల్లని
జనమే తన వారసులని
దేశసేవకై జీవితాన్ని ధారపోసిన వీర సైనికుడు

నిస్వార్ధాన్ని నిలువునా పులుముకున్నవాడు
రేపటి జాతి రత్నాలకు స్ఫూర్తినిచ్చిన వాడు

వేల జీవితాల్లో వెలుగులు ప్రసరింపజేసి
పసి మోమూల పై నవ్వులు పూయించిన
నిరంతర శ్రామికుడు

కాని నేడు
ఆ అందాల చంద్రున్ని
అమావాస్య చీకటి కమ్మేసింది
పడగ విప్పిన పడమరమ్మ
ఆ ప్రభా రాగాన్ని మింగేసింది
చప్పుడు చేయని రెప్పల దుప్పటి
ఆ చూపుల పరుగులనాపేసింది
ఇప్పుడు కలాం గగనంలో వెలుగుతున్నాడు

# బడి

ఎందుకో ఈ వేల
నాడు ప్రగతి పదంలో పల్లవించిన
మా పాఠశాల వైపు అడుగులు వేసాను
చుట్టూ చూస్తుంటే
వలస వెళ్ళిన పిల్లల రాక కోసం
ఎదురు చూసే అవ్వ కళ్లలా కనిపించాయి

అవును
ఎన్నో కుసుమాలు కలబోసిన
నిస్వార్ధ పరిమళం ఇంకా అక్కడే ఉంది
మా పాఠశాల అన్నా
అందులో ప్రముఖ పాత్రను పోషించిన మా గురువులన్నా
మాకేంతో అభిమానం

మా గురువుల సబ్జెక్ట్ లే
వాల్ల పేర్లుగా మా నాలుకల పై నమోదు అయ్యేవి
మా తరగతి గదిలో గురువుగారు
పాఠం పూర్తి చేసి
ప్రశ్నలు నా వైపు విసిరినప్పుడు
ప్రశ్నార్ధకమే నా మోములో ప్రత్యక్షమైయ్యేది
అదేంటో గానీ....!

ఆయన నా చెవి అనే తాళాన్ని
తిప్పగానే

జవాబులు అనే బండ్లు గబగబ వచ్చేవి
పరీక్షా సమరం ఆసన్నమవబోతుందంటే చాలు
మా తరగతి గది నిండా
సమాధానపు మంత్రాలు జపిస్తూ
చిన్న పాటి పూనకాలతో ఊగిపోయే దేహాలు కనిపించేవి
ఇందులో దొంగ జపాలు చేసే
కోతులు కూడా ఉండేవండోయ్....
మరుసటి రోజు సరైన అస్త్రాలు ఉపయోగించిన
రణధీరులకై ర్యాంకుల బిరుదులు ఎదురు చూస్తుండేవి
ఉపయోగించని వారి కోసం
మాస్టారు చేతిలో బెత్తం ఎదురుచూస్తుండేది
ప్రతి బాల్యానికి తొలి పొద్దైన
పొలిమేరైన బడే కదా

# కొంగు

ధైర్యంగా నడిపించే నాన్న చెయ్యిలా
అమ్మ బుజాన చేరి
మృదువైన చెక్కిళ్ళ పై చేదుగా జారే
కన్నీళ్ళను తుడిచేందుకు ముందుగా ముందుకొచ్చే
పెద్ద కొడుకే పైట కొంగు
వేసవిలో విసుగు పుట్టించే స్వేదానికి
విరుగుడైన విసన కర్రయ్యేది
పయనమై వెళ్లే వేల అమ్మ తలకి గొడుగైయ్యేది
కూలి పనిలో నెత్తి మీద మెత్తని సుట్టై నిలిచి
బతుకు బాటలో బరువులెత్తుకుని
అమ్మ కష్టంలో ఇష్టంగా పాలు పంచుకునేది
అమ్మ పక్కన నన్ను నిద్రపుచ్చేందుకు
తాను పానుపై పరచుకునేది
నేను ఆడుకునేందుకు తాను ఉయ్యాలైయ్యేది
సాంప్రదాయానికి తొలకరైంది నిలిచింది

# పాట

పాట మూగ బోయింది
తెలుగు తల్లికి స్వరాభిషేకం చేసి
తెలుగు సాహిత్య జగత్తుకు
మణి హారంగా నిలిచిన గొంతు
నేడు నిషబ్ద గీతం ఆలపిస్తుంటే
పాట మూగ బోయింది

నేల సింహాసనాన్ని విడిచి
గాలి పల్లకి ఎక్కి గగన వీధుల్లోకి పయనమైపోయిన
గాన గంధర్వుడిని చూసి
పాట మూగ బోయింది

తన స్వర కవ్వంతో
గానాంమృతాన్ని చిలికిన ఆ ఆత్మబంధువు
మట్టిలో మమేకమైన ఈ వేల పాట మూగ బోయింది

అభిమాన గుండెలు గుమ్మరించిన
కన్నీటి వర్షాన్ని
దీనంగా తన చూపులతో  తడుముకుంటూ
ఉన్నచోటే చతికిలబడిపోయి
పాట మూగ బోయింది

ఎన్నో మస్తక పుస్తకాలలో
చెరగని సంతకమై
సంగీత కోవెలలో ఆరని గాన దీపికై
తాను నాటిన పాటల తోటలో
తరగని పరిమళాన్ని నింపిన
గాన గంధర్వుడు ఇక అగుపించడంటూ
పాట మూగ బోయింది

అలా తన దైన  దారిలో సాగిపోయే పాటసారికి
కన్నీటి నివాళులర్పిస్తూ
పాట మూగ బోయింది

# పుస్తకాల బస్తా

నిత్యం నా వెంట బడికి వచ్చే
నా పుస్తకాల బస్తా కనిపించటం లేదు

ఇంట్లో ఎక్కడ పడితే అక్కడ పెడితే
అమ్మయినా తిట్టేదే గాని
అది మాత్రం ఏనాడు వేలెత్తి చూయించలేదు

నా బ్రుతకు వనంలో
విజ్ఞాన జ్యోతులను వెలిగించే
నన్ను సన్మార్గంలో నడిపించే ఆ అమృత కలషం ఎక్కడ?
అది
నా వెన్నుపై వాలే వెచ్చని స్నేహ బంధం
నా వెన్నంటి వుండే చిన్ని గ్రంథాలయం
మరో తరగతికి ఉత్తీర్ణతోత్సాహంతో వెల్లాలనే
నా ఆశలగూటికి
నన్ను అలవోకగా చేర్చే అరుదైన వంతెన అది

రేపటి పరీక్షా సమరంలో
నాకెదురు పడే ఎన్నో ప్రశ్నల భానాలను ఎదురించేందుకు
పదునైన సమాధానాల కత్తులెన్నింటికో
ఆశ్రయమిచ్చిన కమ్మని అమ్మ ఒడి
అది కనుమరుగైందని
నా కలలు కన్నీరై జారిపోయే వేళ
ఆ బస్తా ఇదినా... అంటూ...

వేసవి వెంటతరిమితే ఎదురొచ్చిన వసంతంలా
నాయినమ్మ మాట ఊరటనిచ్చింది
హమ్మయ్య..
నా బస్తా నాకు దొరికింది
నా బస్తాతో నా అనుబంధం కవితై మిగిలింది...!

# కవయిత్రి పరిచయం



| | |
|---|---|
| పేరు | : **మాదస్త ప్రణవి** |
| తల్లిదండ్రులు | : మాదస్త లక్ష్మీ - కీ.శే. కిషన్ |
| జన్మతేది | : 21-08-1993 |
| విద్యాభ్యాసము | : ఎం.ఏ. తెలుగు |
| వృత్తి | : ప్రైవేటు ఉపాధ్యాయిని |
| జన్మస్థలం | : గౌరారం గ్రామం |
| మండలం | : ఇందలవాయి |
| జిల్లా | : నిజామాబాద్ - 503 164 |
| ఫోన్ నెంబర్ | : 9347810982 |
| సోదరుడు | : మాదస్త ప్రసాద్ |
| వదిన | : లక్ష్మశ్రీ |

మేన కోడలు, మేనల్లుడు : నవద, కన్నయ్య

రచనలు : పాలకంకులు (వచనకవిత్వం) - 2023

రాబోవు రచనలు: అడుగుల చప్పుడు ( యాత్రాకథనం )